మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 121/ 23 గురువారం నవంబర్, 2023 పేజీలు: 4/వెల రూ5/-



విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి కేంద్రాలుగా నడుపబడుతున్న

మరో ఉదయం

(అక్రిడేషన్ కలిగి ఉన్న) తెలుగు దినపత్రికకు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి

సెల్:9154842842


# ఢిల్లీలో పెరిగిన విషవాయువుల తీవ్రత విజిబులిటి సమస్యతో సతమతమౌతున్న ప్రజలు

**న్యూఢిల్లీ,నవంబర్22(మరో ఉదయం):**

ఢిల్లీని కాలుష్యం వెంటాడుతూనే ఉంది. అసలే చలికాలం దట్టమైన పొగమంచు కమ్మేస్తుంది. దీనికి తోడూ చుట్టుపక్కల నుంచి వస్తున్న విషవాయువులు ఢిల్లీ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.మరో మూడు, నాలుగు రోజులు పరిస్థితి ఇలాగే కొనసాగే అవకాశం ఉందంటున్నారు వాతావరణ నిపుణులు. మన్నటి వరకూ వాయువుల వేగంతో పాటూ గాలి దిశ మార్పుతో కొంత వరకూ ఉపశమనం లభించింది. దీంతో కాలుష్యతీవ్రత కొంత మేర తగ్గిందని భావించారు స్థానికులు. దీంతో అధికారులు కొన్నింటిపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేశారు. ప్రస్తుతం గాలిలో ఉధృతి ఏర్పడి అది కాలుష్యానికి కారణం అవుతోంది. తద్వారా విజిబులిటీ సమస్య తీవ్రంగా మారింది. మంగళవారం ఢిల్లీలోని ఐదు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400కు పైగా నమోదైంది. మధ్యాహ్నం 2గంటలకే రహదారులు కనిపించకుండా మసగగా మారిపోయాయి. దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో సూర్యరశ్మి బలహీనంగా మారింది. సాధారణంగా 2వేల మీటర్ల వరకూ కనిపించే రహదారి.. ప్రస్తుతం 1000 నుంచి 1500 మీటర్ల పరిధిలోనే కనిపిస్తోంది. దీనిపై స్పందించిన సెంట్రల్ పొల్యూషన్ బోర్డు కొన్ని కీలక అంశాలను వెల్లడించింది. సాధారణం కంటే ఒక డిగ్రీ ఉష్ణోగ్రత తక్కువగా నమోదైనట్లు ప్రకటించింది. నిన్న దేశ రాజధాని ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 26.2 డిగ్రీలు కాగా కనిష్ట ఉష్ణోగ్రత 11.5గా నమోదైనట్లు వెల్లడించింది. గాలిలో తేమ భారీగా పడిపోయింది. రెండు రోజుల క్రితం 95శాతం ఉండగా నిన్న 56శాతం ఉన్నట్లు పేర్కొంది. చుట్టుపక్కల నెలకొన్న పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం, దట్టమైన పొగ కారణంగా రోజులు పరిస్థితి ఇలాగే కొనసాగవచ్చని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు. అప్పుడప్పుడూ వేడి నీళ్లతో ఆవిరి పట్టుకొవడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు తలెత్తకుండా కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

# అధికారంలోకి వచ్చాక అసైన్డ్ భూములకు హక్కులు

**సిద్దిపేట,నవంబర్22(మరో ఉదయం):**

బీఆర్ఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసైన్డ్ భూములను పట్టా హక్కులు కల్పిస్తామని మంత్రి హరీష్ రావు అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇక్కడ రూపాయి పని చేయలేదు. ఢిల్లీ నుంచి ఏమీ తెలేదని మంత్రి హరీశ్ రావు విమర్శించారు.




మిగతా 2 లో


# ఓటమి భయంతో కాంగ్రెస్ దాడులు షకీల్‌పై దాడి దుర్మార్గం: కవిత

**నిజామాబాద్,నవంబర్22(మరో ఉదయం):**

బోధన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల దాడిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ...ఓటమికి భయపడే బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు




మిగతా 2 లో


# ప్రధాని మోదీని, సీఎం యోగికి బెదిరింపులు

**ముంబై,నవంబర్22(మరో ఉదయం):**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తర ప్రదేశ్ యోగి అదిత్యానాథ్ చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం ముఠా సభ్యుడు తనకు ప్రధానిమోదీ, సీఎం యోగిలను హత మార్చేందుకు తనకు కాంట్రాక్టు ఇచ్చారని ఏకంగా ముంబై పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు దుండగుడు. దీంతో సదరు వ్యక్తిని మాటల్లో పెట్టిన ముంబై పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. బుధవారం నవంబర్ 22న ఒక పోలీస్ అధికారి ఈ సమాచారాన్ని అందించారు. 29 ఏళ్ల నిందితుడిని కమ్రాన్ అమీర్ ఖాన్‌గా గుర్తించామని చెప్పారు.

# రేవంత్, కాంగ్రెస్‌లను ఓడిస్తేనే దరిద్రంపోతది

### రేవంత్ నమ్ముకుంటే ఆగంకాక తప్పదు

### కామారెడ్డి,కొడంగల్‌లో తుక్కుగా ఓడించాలి

### కొడంగల్ సభలో సిఎం కెసిఆర్ విమర్శలు


2లో






# ఇక్కడ పోడు భూముల సమస్యతీరలేదు

### -చరిత్ర సృష్టించే అవకాశం ఇక్కడి ప్రజలది -నిజామాబాద్ ప్రచారంలో రేవంత్ పిలుపు


2లో




# భారత్ సాయం కోరనున్న ఇస్లామిక్ దేశాలు

**న్యూఢిల్లీ,నవంబర్22(మరో ఉదయం):**

ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందం, సంధి కోసం ఇస్లామిక్ దేశాలతో పాటు ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయి. అక్టోబర్ 7నాటి దాడి తర్వాత ఇజ్రాయిల్ గాజాపై విరుచుకు పడుతోంది. 23 లక్షల జనాభా ఉన్న అత్యంత రద్దీ ఉన్న ప్రాంతంపై దాడులు చేయడం వల్ల అక్కడ 13 వేల మంది పాలస్తీనియన్లు చనిపోయారు. అయితే వీరిలో 5 వేల మంది వరకు చిన్నారులు


మిగతా 2 లో


### రాబోయే రోజుల్లో మక్తల్ గడ్డపైన

# ఎగిరేది కాషాయ జెండానే

### బిబీజేపీ నినాదాలతో దద్దరిల్లిన మక్తల్ గడ్డ

**నారాయణపేట జిల్లా:మక్తల్ నవంబర్-22 (మరో ఉదయం)**

మక్తల్ పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ కుంటలో ఏర్పాటు చేసిన బీజేపీ భారీ భహిరంగ సభకు ముఖ్య అతిథులుగా బీజేపీ ఎన్నికల కమిటీ ఛైర్మన్ ఇటేల రాజేందర్ హాజరై ప్రసంగించారు. సభాధ్యక్షులు కర్నె స్వామి అధ్వర్యంలో ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అహంకారపు కెసిఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. తన సొంత గ్రామంలోని గజ్వేల్ లో రైతులు పంటలు పండించే భూములను దౌర్జన్యానికి పాల్పడిన వారి నాయకులపై ఇప్పటివరకు, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు., దళిత బంధు పేరుతో దళితులను మోసం చేశారని అన్నారు. ఆనాడు అటుకులు తిని ఉద్యమం చేసిన కెసిఆర్ కి ఈనాడు వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ దేశంలోనే మొదటిసారి తెలంగాణ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి ప్రకటించిన ఘనత కేవలం నరేంద్ర మోడీకే దక్కిందన్నారు.మక్తల్ నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి ఆలోచించి బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలార్ ఎంపీ మునిస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, రాష్ట్ర నాయకులు నాగురావ్ నామోజీ, జిల్లా సినియర్ నాయకులు కల్లూరి నగప్ప, నారాయణపేట జిల్లా అధ్యక్షులు పగుడకుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, మండల అధ్యక్షులు చిట్యాల లక్ష్మయ్య, చిట్యాల సర్పంచ్ జానకి, ఎంపీటీసీ కర్నె రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపితో ఒరిగిందేమీ లేదు

### -దేశానికి ఆ పార్టీ నష్టం చేస్తోంది

### -అలంపూర్ సభలో ఖర్గే ఆరోపణలు

**ఆలంపూర్,నవంబర్22(మరో ఉదయం):**

సీఎం కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ముగ్గురు తోడు దొంగలేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. బిజెపితో దేశానికి ఒరిగిందేమీ లేకపోగా తీవ్ర అన్యాయాలు జరుగుతున్నాయని అన్నారు. బుధవారం నాడు ఆలంపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ...' తెలంగాణ





మిగతా 2 లో




# బర్రె లక్క ప్రచారం పై జరిగిన దాడి ని ఖండించిన బీఎస్పీ, సీపీఐ





**నాగర్ కర్నూల్:**

కొల్లాపూర్ నియోజక వర్గంలో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బర్రెలక్క ప్రచారం పై మంగళవారం జరిగిన దాడిని బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ట్విట్టర్ లో తీవ్రంగా ఖండించారు.దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయలని డిమాండ్ చేశారు.రాజకీయాలు కేవలం ఆధిపత్య వర్గాల వారే చేయాలా అని ప్రశ్నించారు.ఇంతకు ముందు శిరీష ఉద్యోగాలు రానందుకు బర్రెలు తీసుకుంటున్నా అని సోషల్ మీడియాలో వీడియో పెట్టిన కారణంగా పెద్దపల్లి పోలీస్ లు శిరీష పై కేసు పెడితే బహుజన సమాజ్ పార్టీ ఆమెకు మద్దతుగా నిలిచింది అని అన్నారు.అదే విధంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బర్రెలక్క ప్రచారం పై జరిగిన దాడిని ఖండించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శిరీషకు ఫోన్ చేసి దైర్యం చెప్పారు. ఇలా ఒక్కరు కాదు చాలా మంది శిరిషకు మద్దతు తెలుపుతూ కొల్లాపూర్ లో ఆమెకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు.ముఖ్యంగా యువత సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.ప్రజల్లో సైతం శిరీష పట్ల సానుకూల స్పందన వస్తుంది.పోలింగ్ నాటికి పరిస్థితి లో ఎన్ని మార్పులు అయిన జరగ వచ్చునని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## నాలుగు ట్రిలియన్ల అబద్ధపు ప్రచారం!

అదిగో పులి అంటే..ఇదిగో తోక అన్నట్టు బీజేపీ సంఘ్ పరివార్ దేన్నయినా సునాయాసంగా ప్రచా రం చేయగలరు. వెనకా ముందూ ఆలోచించకుండా ఒకరి తరువాత ఒకరు నేతలు సామాజిక మాధ్య మాలలో అదరగొడతారు. ఇప్పుడు కూడా అదే జరిగింది. జీడీపీ పరంగా భారత్ 4 ట్రిలియన్ డాల ర్లను దాటి వేసిందంటూ బీజేపీ ప్రచారం చేసింది. అయితే ఇదంతా బోగస్ అని తేలింది. ప్రజలను భ్రమల్లో పెట్టటానికి, మీడియా హెడ్‌లైన్లలో నిలవటానికే ఆ ప్రచారం చేశారని ప్రతిపక్ష కాంగ్రెస్ పే ర్కొంది. బీజేపీ నేతల ప్రచారానికి తగినట్లుగానే కేంద్ర ఆర్థికశాఖగానీ, జాతీయ గణాంకాల కార్యాల యంగానీ ఈ వార్తలను ధ్రువీకరిస్తూ ఎటువంటి ప్రకటన చేయలేదు. భారత్ ఇంకా నాలుగు ట్రిలియ న్ డాలర్ల జీడీపీ స్థాయికి చేరుకోలేదని సంబంధిత ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. దీనిని బట్టి తాము విన్న సమాచారం నిజమో, అబద్ధమో తెలుసుకోకుండా ప్రచార బాకాలు ఊదారు బీజేపీ నే తలు. భారత ఆర్థిక వ్యవస్థ మొట్టమొదటి సారిగా 4 ట్రిలియన్ డాలర్లు దాటిపోయిందన్న పుకారును బిజెపి వర్గాలు ఈ విధంగానే ప్రచారంలో పెట్టారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) సమా చారం అంటూ ఇది బయటకు పొక్కగానే అంతర్జాతీయంగా భారత ఖ్యాతిని పెంచుతున్న అసాధా రణ పరి ణామం అంటూ కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' (మాజీ ట్విట్టర్)లో ఒక సందే శం పోస్టు చేశారు. ఆ వదంతి స్క్రీన్ షాట్‌ను జత చేశారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈయనకు గొంతు కలిపారు. దార్శనికుడైన, చైతన్యవంతుడైన నాయకుని సారథ్యంలోనే ఇది సాధ్య మని ప్రధాని మోడీని ఉద్దేశిస్తూ ఫడ్నవీస్ అందులో శ్లాఘించారు. ప్రధాని మోడీని అ భినందించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా ఇదే పని చేశారు. మనం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్నాం ఇది మోడీ గ్యారంటీ అని ఆయన పేర్కొన్నారు. ఇంకా మరి కొంత మంది బిజెపి నాయకులూ ఇదే విధంగా ఆత్మస్తుతికి పాల్పడ్డారు. ప్రధాని మోడీని పైకెత్తి వేశారు.ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడనిపించుకొంటున్న గౌతమ్ అదానీ ఈ సందర్భంగా భారత దేశాన్ని అభినందించారు. మరి రెండేళ్ళలో ఇండియా ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కాను న్నదని ప్రకటించారు. మువ్వన్నెల జెండా అదే పనిగా వెలుగులు చిమ్ముతున్నదని అన్నారు. అయితే ఇందులో ఏమాత్రం నిజంలేదని లెక్కలు చెబుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవ త్సరంలో దేశం 10.5 శాతం జిడిపి (స్థూల దేశీయోత్పత్తి)ని సాధిస్తే ఆర్థిక వ్య వస్థ 3.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకొంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే 2024-25లో మా త్రమే మన ఆర్థిక వ్యవస్థ 4.2 ట్రిలియన్ డాలర్లకు చేరుకొనే అవకాశముంది. ప్రస్తుతం అతి పెద్ద ఆ ర్థిక వ్యవస్థల్లో ఇండియా 5వ స్థానంలో వుంది. 4వ స్థానంలో వున్న జపాన్‌ను మించిపోవాలంటే కనీ సం మరి మూ డేళ్ళు పడుతుందని ఐఎంఎఫ్ నిపుణులు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం మూడో స్థానంలో గల జర్మనీని దాటాలంటే ఆ తర్వాత మరొక ఏడాది పడుతుందని అంచనా వేస్తున్నారు. 2027 నాటికి ఇండియా మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే వచ్చే కొద్ది సంవత్సరాల్లో సగటున సాలీ నా 9.19 శా తం వృద్ధిని సాధించవలసి వుంటుంది. 2013-2018 మధ్య 11.8 శాతం, 2019 2023 మ ధ్య 10 శాతం సగటు వృద్ధిని భారత ఆర్థిక వ్యవస్థ సాధించింది. 202324 మొదటి త్రైమాసికంలో ఈ వృద్ధి 8 శాతంగానే నమోదైంది. వాస్తవాలు ఇలా వుండగా వున్నపళంగా 4 ట్రిలియన్ డాలర్లను దాటి పోయామనే సమాచారం ఎక్కడి నుంచి వచ్చింది? దీనిని ఒక యూ ట్యూబ్ వీడియో నుంచి తీసుకొ ని ప్రచారంలో పెట్టినట్టు రూఢి అవుతున్నది. ఎన్నికలు జరుగుతున్న తెలంగాణ, రాజస్థాన్‌లలో ప్ర ధాని మోడీ గొప్పతనాన్ని చాట డానికి ఈ తప్పుడు సమాచార వ్యాప్తి అసాధారణ స్థాయిలో జరుగు తున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సామాజిక మాధ్యమాన్ని విశేషంగా వాడుకొంటున్నారు. ఇంతకు ముందు చత్తీస్‌గఢ్‌లో కూడా ఇదే పని చేశారు. ఇండియా 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకొన్నదని న మ్మించడానికి 190 దేశాల జిడిపి అంకెలను తప్పుడుగా పేర్కొంటూ ప్రచారం చేస్తున్నారని తెలి సింది. నిజానికి, భారత ఖ్యాతి వెలిగిపోతున్న సంపదలో కాదు...పేదలు అత్యధిక సంఖ్యలో గల దేశంగా భారతదేశ ఖ్యాతి మార్మోగిపోతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 81.35 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారు. వీరిలో 75 శాతం మంది గ్రామీణులు కాగా, 50 శాతం మంది పట్టణ ప్రాంతాలకు చెందినవారు. 80.48 కోట్ల మందికి ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకాన్ని వర్తింప చేస్తున్నారని ఈ నెల 15వ తేదీ తర్వాత వెల్లడైంది. కాబట్టి ఇంత మంది పేదలు న్న దేశం జిడిపి వృద్ధిలో ఎంత ఎదిగినా పేదలకు ఉపయోగం ఏమిటి?

# రేవంత్, కాంగ్రెస్‌లను ఓడిస్తేనే దరిద్రం పోతది

మొదటి పేజీ తరువాయి

**కొడంగల్,నవంబర్22(మరో ఉదయం):**

రేవంత్ రెడ్డి లాంటి దొంగలతో రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతందని., ఆయన ముఖ్యమంత్రి అయ్యేది లేదు..పొయేద్ది లేదని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై సీఎం కేసీఆర్ నిప్పులు చెరిగారు. రేవంత్, కాంగ్రెస్ లాంటి వారిని తరిమితే తప్ప దరిద్రం వదలదని అన్నారు. కొడంగల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచార సభలో కేసీఆర్ మాట్లాడుతూ రేవంత్ టార్గెట్‌గా మండిపడ్డారు. కామారెడ్డిలో కూడా పోటీకి వచ్చాడని, అక్కడ తుక్కుతుక్కుగా ఓడించబోతున్నారని, ఇక్కడా ఓడిస్తేనే కొడంగల్ బాగుపడుతుందని అన్నారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డి పెద్ద భూకబ్జాదారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామంటున్నారు. రేవంత్ రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎలాంటి పనులు చేయలేదు. రేవంత్ నోరు తెరిస్తే గబ్బు. ఆయన టికెట్లు అమ్ముకున్నారని కాంగ్రెస్ నేతలే అంటున్నారు. తెలంగాణ ఉద్యమకారులపైకి రేవంత్ తుపాకీ పట్టుకొని వెళ్లారు. కాంగ్రెస్ నేతలకు వ్యవసాయం గురించి ఏమీ తెలియదు. రేవంత్ రెడ్డి ఏనాడైనా వ్యవసాయం చేశారా? పొలం దున్నారా? అందుకే ఇలా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నీతి నియమం లేని వ్యక్తి రేవంత్ రెడ్డి. రూ.50 లక్షలతో ఎమ్మెల్యేలను కొంటూ పట్టుబడిన ఆయన తీరును ప్రజలంతా టీవీల్లో చూశారు. ఇవన్నీ చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడటం విడ్డూరంగా ఉంది. రేవంత్ సీఎం అవుతాడని ఓట్లేస్తే కొడంగల్ పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుందని అన్నారు. కొడంగల్‌లో పనులన్నీ చేసి పెట్టే నరేందర్ రెడ్డి కావాలా? ఉత్త మాటలు చెప్పే రేవంత్ రెడ్డి కావాలా? ప్రజలే తేల్చుకోవాలని పిలుపు ఇచ్చారు.ఇప్పుడు కొడంగల్‌లో సరిపోలేదని.. కామారెడ్డిలో నాపై పోటీకి వస్తున్నారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో చిత్తుగా ఓడించాలి. నేనే సీఎం అనేవాళ్లు కాంగ్రెస్‌లో 15 మంది ఉన్నారు. అయినా కాంగ్రెస్ గెలిస్తే కదా.. రేవంత్ సీఎం అయ్యేది. రేవంత్ సీఎం అవుతాడని ఓట్లేస్తే కొడంగల్ పరిస్థితి మళ్లీ మొదటికే. ప్రజలు ఇవన్నీ గమనించాలి. కొడంగల్‌లో పనిచేసే నరేందర్ రెడ్డి కావాలా? వట్టిమాటలు చెప్పే రేవంత్ రెడ్డి కావాలా? ప్రజలే తేల్చుకోవాలి. ఎమ్మెల్యేగా ఎవరుంటే కొడంగల్ గౌరవం పెరుగుతుందో ప్రజలే నిర్ణయం తీసుకోవాలని కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డి పెద్ద భూకబ్జాదారు అని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామంటు న్నారని సీఎం కేసీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎలాంటి పనులు చేయలేదని.. రేవంత్ నోరు తెరిస్తే గబ్బు అని ఎద్దేవా చేశారు. నీతి నియమం లేని వ్యక్తి రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ఎమ్మెల్యేలను రూ.50 లక్షల డబ్బుల బ్యాగుతో కొంటూ పట్టుబడ్డారని గుర్తు చేశారు. కొడంగల్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో చిత్తు చిత్తుగా ఓడించాలని కోరారు. ఎవరికి వారు నేనే సీఎం అని కాంగ్రెస్ లో దాదాపు 15 మంది తిరుగుతూ ఉంటారని అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే కదా.. రేవంత్ రెడ్డి సీఎం అయ్యేదని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## అధికారంలోకి వచ్చాక అసైన్ భూములకు హక్కులు

దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపును కాంక్షిస్తూ బుధవారం దుబ్బాక, మిరుదొడ్డిలో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి పాల్గొని మాట్లాడారు. బీజేపీ వాడు గెలిస్తే బోరుబాయి కాడ మోటర్ వస్తది అని అనాడే చెప్పాను. నిన్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ. 25 వేల కోట్లు ఇవ్వలేదని ఒప్పుకున్నారు. ఇప్పుడు రఘునందన్ ఎక్కడ తలకాయ పెట్టుకుంటావని మంత్రి సూటిగా ప్రశ్నించారు. మీ మంత్రి స్వయంగా చెప్పారు. కేసీఆర్ వచ్చాక 24 గంటల కరెంట్ వచ్చిందా లేదా? కర్ణాటక డిప్యూటీ సీఎం ఇక్కడ మాట్లాడాడు. అక్కడ 5 గంటల కరెంట్ ఇస్తున్నామని గొప్పగా చెప్పాడు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అసలు రంగు బయట పడిందన్నారు. ఇక్కడ ప్రభాకర్ రెడ్డి గెలవాలి. అక్కడ కేసీఆర్ గెలవాలి. మంచి నీళ్లు ఇంటింటికీ ఇచ్చింది కేసీఆర్ అని గుర్తు చేశారు. కలలో కూడా కననిది, బ్రహ్మం సైతం చెప్పనిది కేసీఆర్ చేసి చూపెట్టారని మంత్రి తెలిపారు. మేనిఫెస్టోతో పాటు రామక్క పాటను కూడా కాంగ్రెస్, బీజేపీలు నఖల్ కొట్టాయని ఎద్దేవా చేశారు. రామక్క పాట తెలంగాణలో దుమ్ము రేపుతున్నది. పార్టీ కాదు, కేసీఆర్ మీద ప్రేమతో కల్వకుర్తికి చెందిన ఒక చెల్లి రాసిన పాటకు కాంగ్రెస్, బీజేపీల గుండెలు జల్లుమంటున్నాయని పేర్కొన్నారు. మన ప్రభుత్వం వస్తుంది.

మొదటి పేజీ తరువాయి

## ఓటమి భయంతో కాంగ్రెస్ దాడులు షకీల్‌పై దాడి దుర్మార్గం: కవిత

దాడులు చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. 60 లక్షల గులాబీ సైన్యం ముందు మీరెంత. సత్తా కలిగిన బీఆర్ఎస్ కార్యకర్తలు దాడులను ప్రజాక్షేత్రంలో దీటుగా ఎదుర్కొంటారు. ఇలాంటి దాడులకు తెగబడితే కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్‌లో కాంగ్రెస్ నాయకులపై పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే షకీల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే పోలీసులు మాత్రం కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

## ఇక్కడ పోడు భూముల సమస్య తీరలేదు

**నిజామాబాద్,నవంబర్22 (మరో ఉదయం):**

సీఎం కేసీఆర్ రాసిపెట్టుకో కాంగ్రెస్ పార్టీకి 80 సీట్ల కంటే ఒక్క సీటు తగ్గదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పదేళ్లపాటు కుటుంబం అంతా కలసి దోచుకుందని అన్నారు. వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కెసిఆర్‌ను ఓడించడం ద్వారా నిజామాబాద్ ప్రజలు చరిత్ర సృష్టించాలన్నారు. బుధవారం నాడు ఉమ్మడి జిల్లాలో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి నిజామాబాద్ జిల్లాలో మాట్లాడుతూ...'డిసెంబర్ 3వ తేదీన లెక్క చూసుకో కేసీఆర్.. 80 కంటే ఒక్కటి తక్కువున్నా ఏ చర్యకైనా సిద్ధం. కేసీఆర్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారు. ఇక్కడ పోడు భూముల సమస్య తీరలేదు. గిరిజనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని 100 రోజుల్లో తీరుస్తానని పదేళ్లయినా తెరువలేదు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇక్కడి రైతులు ఓడించారు. ఈ ప్రాంత రైతుల సమస్యలను బీఆర్ఎస్ నేతలు పట్టించుకోలేదు. బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేసి వారి హక్కులను కాలరాశారు. అయ్య బక్కోడు.. కొడుకు తిరుగుబోతోడు. ప్రజలను ఆదుకోవాలంటే ఒక్కరూ ముందుకు రారు.ఎర్రజొన్న రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయలేదు. పసుపు బోర్డు తెస్తానన్న గుండోడు ఎక్కడికో పోయిండు. నేను పాదయాత్ర చేసినప్పుడు ఈ ప్రాంత యువకులు నన్ను ఇక్కడి నుంచి పోటీ చేయమని అడిగారు. అధిష్ఠానం నన్ను కామారెడ్డిలో పోటీ చేయమని ఆదేశించింది' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎవరు గెలుస్తారో రాష్ట్ర ప్రభుత్వం అదే వస్తుంది. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తాం. మేడిగడ్డ మూడేళ్లకే కుంగి పోయింది. మీరు కట్టిన ప్రాజెక్టులు చూపించి బీఆర్ఎస్ నేతలు ఓట్లు

అడగాలి. మేము కట్టిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు చూపించి ఓట్లు అడుగుతాం. ఇందిరమ్మ రాజ్యం అంటే గరీబోళ్ల రాజ్యం. బీఆర్ఎస్ అంటే దొరల రాజ్యం, దొంగల రాజ్యం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని కేసీఆర్ ఊహాలోకంలో ఉంచారు. ఆయన మాత్రం 150 రూముల బంగ్లా కట్టుకున్నాడు. బోధన్ ఏసీపీకి చెప్తున్నా.. నీ నౌకరి నువ్వు చెయి.. బీఆర్ఎస్ కార్యకర్తలాగా చేయకు.. డిసెంబర్ 3వ తేదీ తర్వాత ఏమైతదో చూడు కేసీఆర్' అని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

మొదటి పేజీ తరువాయి

## బిజెపితో ఒరిగిందేమీ లేదు

ప్రజలు ఇచ్చే విజయ కానుకను భారతదేశం మొత్తం ప్రతిబింబిస్తుందన్నారు.. ఆలంపూర్ చాలా పవిత్రమైన ప్రాంతం.. కృష్ణ మరియు తుంగభద్రాల సంగమ ప్రాంతం. దేశంలో ఉన్న మూడు పత్రికల సుమారు 780 కోట్ల ఆస్తులను బీజేపీ ప్రభుత్వం జప్తు చేసింది. ఈ మూడు పత్రికలు నెహ్రూ సొంత ఆస్తి. నెహ్రూ స్థాపించిన ఈ మూడు పత్రికలు స్వతంత్ర పోరాటానికి ముఖ్య భూమికను పోషించాయని మల్లికార్జున ఖర్గే తెలిపారు. నిరుపేదలను ఆదుకోవడంలో బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్షం చేస్తున్నాయి. ఇందిరాగాంధీ నీ విమర్శిస్తున్నావు ఇందిరాగాంధీ ఎక్కడ.. మరి కేసీఆర్ ఎక్కడ.. ఫామ్ హౌస్‌లో కూర్చొని పరిపాలిస్తున్నావు. 2017లో ఇచ్చిన నీ హామీలు ఏమయ్యాయి.. ఏ ఒక్కటి పూర్తి చేయలేదు. తెలంగాణ కోసం అప్పట్లో ఎంపీగా ఉన్న విజయశాంతి ఢిల్లీలో పార్లమెంట్‌లో సభ జరిగినప్పుడు తెలంగాణ కోసం స్పీకర్ పోడియంలోకి వెళ్లి 4, 5 గంటలు పోట్లాడింది.. ఆ సమయంలో నువ్వు ఎక్కడున్నావ్ కేసీఆర్.. కేసీఆర్,కొడుకు, కూతురు, అల్లుడు తెలంగాణను దోచుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. స్థానికి కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ సాయం కోరనున్న ఇస్లామిక్ దేశాలు

**న్యూఢిల్లీ,నవంబర్22(మరో ఉదయం):**

ఉండటంపై అన్ని దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో సంధి కోసం భారత్ సాయం కోరేందుకు పవర్ ఫుల్ ఇస్లామిక్ దేశాల ప్రతినిధి బృందం మన దేశాన్ని సందర్శించనున్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్, పాలస్తీనా, ఇండోనేషియా విదేశాంగ మంత్రులతో కూడిన ప్రతినిధి బృందంతో పాటు ఐఓసీ జనరల్ సెక్రటరీ గాజాపై చర్చించడానికి భారతదేశాన్ని సందర్శించనున్నట్లు తెలిసింది. గాజా సంక్షోభంపై చొరవ తీసుకునేందుకు రియాద్‌లో ఏర్పాటు చేసిన అరబ్, ఇస్లామిక్ దేశాలకు చెందిన ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం భారత్‌తో పాటు %ూ%5 దేశాలను సందర్శించనున్నారు. అయితే ఇప్పటి వరకు వారి తేదీలు ఖరారు కాలేదు. ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్, పాలస్తీనా, ఇండోనేషియా విదేశాంగ మంత్రులు మరియు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (%ూ×జ%) ప్రధాన కార్యదర్శి ప్రతినిధి బృందంలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితిలోని శాశ్వత సభ్యదేశాలైన యూఎస్, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలను పీ5 దేశాలుగా పిలుస్తారు. కాల్పుల విరమణ, గాజాపై శతృత్వానని వీడేలా ఇజ్రాయిల్‌ని ఒప్పించాలనీ పీ5 దేశాలతో పాటు ఇండియాను కోరనున్నారు. ఇటీవల సౌదీ రాజధాని రియాద్‌లో ఇస్లామిక్ దేశాలు నవంబర్ 11న భేటీ అయ్యాయి. ఈ సమావేశంలో ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలని ఇరాన్ సభ్యదేశాలను కోరింది. ప్రతినిధి బృందం చైనాలో పర్యటించి, ఈ యుద్ధాన్ని నిలపుదల చేయాలని కోరింది. ఈ పర్యటన తర్వాత రష్యాలో పర్యటించిన బృందం, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో సమావేశమైంది. పౌరుల రక్షణ, మానవతా కారిడార్లు, బందీల విడుదలపై చర్చించారు.

మొదటి పేజీ తరువాయి

## మానవతా విలువలకు కట్టుబడి పనిచేసిన సాయి డీమ్డ్ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము

గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ అతిథి గా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో శ్రీసత్య సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ (ఎస్.ఎస్.ఎస్. ఐ.హెచ్ ఎల్) ఛాన్స్.లర్ కే చక్రవర్తి రిటైర్ ఐఏఎస్, వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ బి రాఘవేంద్ర ప్రసాద్,రాష్ట్ర మహిళా, పిల్లలు, వికలాంగులు మరియు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ మంత్రి కె.వి ఉష శ్రీ చరణ్, సత్యసాయి సెంటర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఎస్ ఎస్ నాగానంద్ , తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ... పుట్టపర్తిలో శ్రీసత్యసాయి 98వ జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.నేడు భగవాన్ సత్య సాయి బాబా సమాధిని దర్శించే సౌభాగ్యం కలిగిందన్నారు. ప్రశాంతి అనగా ఆధ్యాత్మిక శాంతి అని అన్నారు. సదా సత్యం పలకాలని, సదా ధర్మాన్ని ఆచరించాలన్న బాబా వాక్కులను నిజ జీవితంలో అలవరుచుకొని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. భగవాన్ సత్యసాయిబాబా తాను బోధించిన మానవతా విలువలు, ఆధ్యాత్మికత కలగలిపి ఆధునిక విజ్ఞానాన్ని అందించేందుకు చక్కటి విద్యా వ్యవస్థను నెలకొల్పారన్నారు. మనమందరం ఆధ్యాత్మిక చింతన ,కరుణ,పరోపకారం కలిగి సత్యసాయిబాబా అడుగుజాడల్లో నడవాలన్నారు. సత్యసాయి భారతీయ విద్యావిధానంలో అనాదిగా అమలవుతున్న గురుకుల విద్యా విధానానికి మెరుగులుదిద్దుతూ, నేటి సమాజ అవసరాల మేరకు మార్పులు చేసి నూతన గురుకుల విధానాన్ని అమలయ్యేలా విద్యా వ్యవస్థలను రూపొందించారన్నారు. మానవతా విలువలు, ఆధ్యాత్మికత, శాస్త్ర సాంకేతిక అంశాలతో కూడిన సమ్మిళిత విద్యను బోధిస్తూ అత్యద్భుతమైన ఫలితాలతో ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థల సరసన నిలిపారన్నారు. సత్యసాయి విద్యాసంస్థలు ఉత్తమ ప్రమాణాలతో కూడిన ఆదర్శ విద్యను అందిస్తున్నాయన్నారు. అందువల్లే సత్యసాయి విద్యాసంస్థలు విలువల నిలయాలుగా నిలచాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా ప్రజలకు వైద్య, విద్యా,మంచినీరు వంటి ఎన్నో సేవలు అందించారాన్నారు.భగవాన్ సత్యసాయిబాబా సేవలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. గోల్డ్ మెడల్ సాధించిన, కాన్వకేషన్ పొందిన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారురాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... బాబా సత్యసాయిబాబా 42 వ స్నాతకోత్సవం లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ప్రేమ,సాధన వంటి వాటిని అలవర్చుకొని జీవితంలో అభివృద్ధి చెంది దేశానికి సేవలు అందించాలన్నారు శ్రీ సత్య సాయి బాబా విద్యాసంస్థల్లో నేటి ఆధునిక విద్యతోపాటు సమగ్ర సమైక్యతను నెలకొల్పే ప్రాచీన కాల గురుకుల విద్య వ్యవస్థను కూడా పాటిస్తూ విద్యార్థుల జీవితంలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. ప్రపంచమంతా వసుధైక కుటుంబమని ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి జీవించాలని సూచించారు. అలాగే విద్యార్థులు అందరూ ధర్మం సత్యాన్ని పాటించి ధర్మో రక్షిత రక్షితః అనే సిద్ధాంతాన్ని పాటిస్తూ జీవితంలో ఉన్న స్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు.

అలాగే కాన్వకేషన్ పొందిన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన శ్రీసత్యసాయి బాబావిద్యాసంస్థల విద్యార్థులకు పట్టాలతో పాటు 21 మందికి బంగారు పతకాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.కార్యక్రమానికి ముందు ట్రస్ట్ సభ్యులు ముఖ్య అతిథులను సన్మానించారు.వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ బి రాఘవేంద్ర ప్రసాద్ కాన్వగేషన్ పొందిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.అంతకుముందు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము భారత వాయుసేన విమానంలో ఒడిశా నుంచి బుధవారం మధ్యాహ్నం సత్యసాయి విమానాశ్రయానికి ద్రౌపది ముర్ము చేరుకున్నారు.అనంతరం రాష్ట్రపతి సాయి కుల్వంత్ హాలు లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ , ఎమ్మెల్యేలు దుద్దుగుంట శ్రీధర్ రెడ్డి, తిప్పేస్వామి, జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు,వివిధ విద్యా సంస్థల అధికారులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్యసాయి జిల్లాలో పర్యటించారు. ఢిల్లీ నుంచి పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న ద్రౌపది ముర్ము అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సత్యసాయి ఆశ్రమం వద్దకు వెళ్లారు. పుట్టపర్తికి చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మంత్రి ఉష శ్రీ చరణ్, పుట్టపర్తి ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ప్రశాంతి నిలయానికి బయలుదేరారు. ప్రశాంతి నిలయంలో సత్యసాయి సమాధిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. ఆ తర్వాత పుట్టపర్తిలో సాయిహీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు రాష్ట్రపతి వెళ్లారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీ 42వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 14 మందికి డాక్టరేట్లు, 21 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగించారు. అనంతరం రోడ్డు మార్గంలో సత్యసాయి విమానాశ్రయానికి చేరుకొని.. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిపోయారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో ఎమ్మెల్యే సొంత మండలం

## నవాబ్ పేట మండలాన్ని అభివృద్ధి చేయలేని కాలే యాదయ్య

**చేవెళ్ల:**

తన సొంత మండలం నవాబ్ పేట ను అభివృద్ధి చేయలేని ఎమ్మెల్యే కాలే యాదయ్య నియజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేయగలడో ఒక్కసారి ఆలోచించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భీమ్ భరత్ అన్నారు. బుధవారం నవాబ్ పేట మండలం లోని పోలేపల్లి, అట్నాపుర్, అత్తాపూర్, చించోల్ పేట్, చిట్టిగడ్డ స్టేషన్, నవాబ్ పేట, ఎత్తు రాస్ పల్లి, నాగిరెడ్డి పల్లి,కేశవ పల్లి తండా,ఎక్ మామిడి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. భీమ్ భరత్ ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ కాలే యాదయ్య కు రాజకీయ జన్మనిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.అలాంటి పార్టీ పైన మతి తప్పి బురదజల్లే పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.తన సొంత గ్రామం లోనే పేదల కల్లాల జాగలను గుంజుకున్న చరిత్ర కల్గిన యాదయ్యకు ఓటు వేస్తే ఎంతటి ప్రమాదమో ఒక్కసారి ఆలోచించాలి అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కాలే యాదయ్య సొంత మండలం, ఆదిలాబాద్ అడవులను తలపిస్తుంది,అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు.చేవెళ్ల నియోజకవర్గానికి కంపెనీలు తెచ్చిన అని చెప్పుతున్నావ్,నీ కుటుంబీకులకు ఆ కంపెనీలో ఉద్యోగాలు పెట్టియ్యలేవు ఎందుకు ....? రాజకీయ ఉద్యోగాలు మాత్రమే పెట్టించావు, గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను వీడియోలు తీసి బెదిరిస్తున్నావు కార్యకర్తల జోలికొస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. అవినీతి ఎమ్మెల్యే తిన్న అక్రమ సంపాదన ,ప్రజాధనాన్ని తిరిగి కక్కిస్తా అని అన్నారు. ఎంపిటిసి ,జడ్పిటిసి, ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అధికారం అప్పచెపితే నిర్దాక్షణంగా కోట్ల రూపాయలకు టిఆర్ఎస్ కు అమ్ముడుపోయిన కాల యాదయ్య నీతులు మాట్లాడుతుంటే చేవెళ్ల ప్రజలు నవ్వుతున్నారన్నారు, కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ పై కాల యాదయ్యకు ఎలా బురద చల్లాలనిపిస్తుంది ఒక్కసారి మతిభ్రమించి మాట్లాడుతున్నాడా అనిపిస్తుందన్నారు, ప్రతిసారి నామీద కేసులు ఉన్నాయని మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, బిజెపి అభ్యర్థులకు నేను సవాల్ విసురుతున్న బరాబర్ నేను పేదల పక్షాన ప్రజాక్షేత్రంలో



పోరాడిన వాడిని కేసులు లెక్క చేసేవాడిని కాదన్నాడు.ఏనాడైనా ప్రజా ఉద్యమాల్లో గాని ప్రజా సంక్షేమ ఉద్యమాలు గాని ప్రజల కోసం పోరాడిన చరిత్ర బిజెపి పార్టీ అభ్యర్థికి గానీ , బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి లేదని గుర్తు చేశారు.నా జీవితమంతా ప్రజల కోసమే ప్రజల కోసం కొట్లాడిన చరిత్ర నాకు ఉందని బరాబర్ నాపై కేసులు ఉంటాయని అన్నారు.కాలే యాదయ్య నేను ప్రజల కోసం పోరాడిన వాడిని ఎంతోమందికి భూ పోరాటాలు చేసి భూములు ఇప్పించిన వ్యక్తిని.చేవెళ్ల నియోజకవర్గం లో నీ సొంత గ్రామంలో నిరుపేదల పండించిన పంటను కల్లాలు చేసి గింజలు పట్టే జాగలను వదలని వ్యక్తివి నువ్వు అని ఆరోపించారు.నీకు మొట్ట మొదట నీ సొంత గ్రామ ప్రజలే తగిన బుద్ధి చెప్తారు అని అన్నారు .

# వీర్లపల్లి శంకర్ మద్దతుగా ప్రచారానికి పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి పథకాలను వివరించేందుకు వచ్చిన కర్ణాటక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ శరణు ప్రకాష్ పాటిల్

**షాద్ నగర్:నవంబర్ 22(మరో ఉదయం):**

అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ ప్రచారం కోసం పాండిచ్చేరి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామితో పాటు ఆయా పథకాలను వివరించేందుకు కర్ణాటక రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ శరణు ప్రకాష్ పాటిల్ బుధవారం షాద్ నగర్ పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు వీర్లపల్లి శంకర్ స్వగృహం వద్ద స్థానిక నాయకులతో సమావేశం అయ్యారు. భోజనం అనంతరం వారు చౌదరిగుడా ఉమ్మడి మండలంలో ఏదిరా గ్రామంలో ప్రచారంలో పాల్గొనడం జరిగింది వీరితోపాటు పాండిచ్చేరి సీఎల్పీ లీడర్ వైద్యనాథ్ పాండిచ్చేరి మాజీ మంత్రి అనంతరం మహబూబ్నగర్ పార్లమెంట్ అబ్జర్వర్ కుమార్ మంగళం పాల్గొనడం జరిగింది



# ఊపందుకున్న వెన్నుపోటు రాజకీయం.. అభ్యర్థులకు కట్టప్పల భయం

**హైదరాబాద్, నవంబర్ 22(మరో ఉదయం):**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్కు గడువు సమీపిస్తుం డటంతో అభ్యర్థులు తమ ప్రత్యర్థులపై ఫోకస్ పెడుతున్నారు. ప్రత్యర్థి పార్టీలో ఉంటూనే తమకు స హకరించేలా అంతర్గత ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. కొన్ని నియోజకవర్గాలలో ఆయా పార్టీ ల అభ్యర్థులకు సన్నిహితంగా ఉండే కీలక నేతలు వెంటూనే వెన్నుపోటు పొడిచే ప్రమాదం పొంచి ఉందన్న ఆందోళన అభ్యర్థుల్లో మొదలైంది. దీంతో తమ వెంట ఉన్నవారిలో ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో తెలీక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలకు సమయం సమీపి స్తుండటంతో అభ్యర్థులు ప్రత్యర్థుల బలాబలాలు, వ్యూహాలను తెలుసుకుంటూ, ఎప్పటికప్పుడు తి ప్పికొడుతూనే వారిని ఇరకాటంలో పెట్టేందుకు వారి అనుచరులనే తమకు అనుకూలంగా మలుచు కుంటున్నారు. ఇప్పుడు తమకు సహకరిస్తే ఎన్నికల్లో గెలిచాక అన్ని విధాలా చూసుకుంటా మం టూ భరోసానిస్తున్నట్లు సమాచారం.తమ పార్టీలో చేరడం కంటే ప్రత్యర్థి పార్టీలోనే ఉండి తమ గెలు పు కోసం కృషి చేయాలని కోరుతున్నారు. ఈ సమయంలో పట్టణాలు, డివిజన్లు,మండలాలు, గ్రా మాలు నియోజక వర్గ స్థాయిల్లోని చోటామోటా నాయకుల పాత్ర అత్యంత కీలకంగా మారింది. ఆర్థిక ప్రయోజనాలు, సొంత గుర్తింపు కోసం ఈ నేతలు ఏ పార్టీలో స్థిరంగా ఉండటం లేదు. ప్రత్యర్థులు ఇస్తామంటున్న తాయిలాలకు లొంగిపోతున్నారు. దాదాపు అన్ని పార్టీల్లోనూ ఇవే పరిస్థితులు కని పిస్తుండటంతో గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పార్టీలు, అభ్యర్థులకు వెన్నుపోట్లు అధికంగా జరుగు తున్నాయి. ఈ క్రమంలో వెనక్కి వచ్చిన వారు, కొత్తగా తమతో చేరిన వారిలో ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియక అభ్యర్థులు సతమతమవుతున్నారు. తమ వెంటనే ఉంటూ వెన్నుపొ డిచే కట్టప్పల గురించి అభ్యర్థులకు తెలిసినా వారికి పొమ్మనలేకపోతున్నారని, అలాగని దూరం పె ట్టలేకపోతున్నారు. ప్రత్యర్థి పార్టీ నుంచి తాయిలాలు అందుకున్న కొంతమంది చోటామోటా నేతలు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం పూట పార్టీ అభ్యర్థి వెంట తిరుగుతూ ఓటు వేసి గెలిపించా లని కోరుతున్నారు. తిరిగి రాత్రి పూట అదే ప్రాంతానికి వెళ్లి.. తమ పార్టీకి ఓటేయొద్దని చెబుతున్న ట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాలలో గ్రామాలు, మండలాల వారీగా ఓటర్లను కలిసి వారి అవ సరాలు తీర్చే బాధ్యతను పార్టీకి చెందిన కొంతమంది నమ్మకమైన నాయకులకు బాధ్యతలు అప్ప గించారు. ఆ నాయకులే అభ్యర్థి నుంచి అవసరమైన వనరులన్నీ తీసుకున్నాక.. వేరే పార్టీకి సహక రిస్తున్నట్లు తెలుసుకుని అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ప్రస్తుతం ప్రచారం తారాస్థాయిలో కొనసాగుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు తమదే అన్న ధీమాతో ఉన్నారు. అయితే కొన్ని నియోజకవర్గాలలో స్వల్ప తేడాతోనే కొంతమంది అభ్య ర్థుల గెలుపు ఓటములు ఖరారయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఓటు కీలకం కానుంది. అందుకే బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాల వలస వెళ్లిన నియోజకవర్గ ఓటర్లను ఓటింగ్ కోసం పిలించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. వారి ఫోన్ నెంబర్లు సేకరించి నేరుగా వారితోనే మాట్లాడు కుంటున్నారు.ఇతర ప్రాంతాలలో ఉంటున్న వారికి తాయిలాలు ఇచ్చి తమ వైపు తిప్పుకుంటే ఆ ఓట్లు కచ్చితంగా పడతాయనే నమ్మకం ఏర్పడుతుండటంతో ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా అందరినీ పోలింగ్ బూత్కు రప్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థులు, యువతకు ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. చదువుకునే విద్యార్థుల ఓట్లకు డబ్బు, మద్యం అంతగా అవసరం ఉండదు. కొత్త ఓటర్ల అవసరాలను గురించి ఈ తరానికి తగినట్లుగా హామీలు ఇవ్వగలిగితే వారిని తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తూ, అందుకనుగుణంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు.

# యూజీసీ -నెట్ సిలబస్కు సవరణలు

**న్యూఢిల్లీ, నవంబర్ 22(మరో ఉదయం):**

జాతీయ అర్హత పరీక్ష(నెట్) సిలబస్ను సవరించాలని యూనివ ర్సిటీ నిధుల సంఘం(యూజీసీ) నిర్ణయించింది. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ మంగళవారం తెలిపారు.కొత్త సిలబస్ను ప్రవేశపెట్టే ముందు అ భ్యర్థులకు ప్రిపరేషన్ కోసం తగినంత సమయం ఇస్తామని చెప్పారు. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ కోసం, అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హత పరీక్షగా యూజీసీ-నెట్ను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.



# గ్రేటర్ ఓటరు నాడి ఎటువైపు కొట్టుకుంటోంది!

**హైదరాబాద్, నవంబర్ 22(మరో ఉదయం):**

మినీ భారత్గా పిలిచే హైదరాబాద్లో వివిధ రాష్ట్రాలు, జి ల్లాల నుంచి వచ్చి స్థిరపడిన వారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరంతా ఇప్పుడు రాజధాని పరిధి లోని మెజార్టీ స్థానాల్లో అభ్యర్థుల భవితను నిర్ణయించనున్నారు. 29 నియోజకవర్గాల్లో సగానికి పైగా వాటిలో ఇతర ప్రాంతాల ఓటర్లే విజయావకాశాలపై ప్రభావం చూపించనున్నారు. అందుకే వారిని ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు ఆయా ప్రాంతాల నుంచి నేతలను రప్పించి ఆ ఓటర్లతో మాట్లాడిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో వివిధ రాష్ట్రాల నుంచి పలు పార్టీల నేతలు ప్రత్యేకంగా హైదరాబాద్కు వస్తుండటం విశేషం. రాజధాని పరిధిలోని 29 నియోజకవర్గాల్లో సుమారు 42 లక్షల వరకు ఓటర్లు ఇతర రాష్ట్రాలు, తెలం గాణలోని పలు జిల్లాల నుంచి వచ్చి స్థిరపడిన వారు ఉన్నారని అంచనా. ఏపీ నుంచి వచ్చిన వారి లో అత్యధికంగా శేరిలింగంపల్లి, కూకట్పల్లి, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, సనత్నగర్తో పాటు మరి కొన్ని నియోజకవర్గాల్లో ఉన్నారు. సనత్నగర్ జెక్ కాలనీలో స్థిరపడిన వారిలో అధికంగా ఏపీ వారే. ఇతర కాలనీల్లోనూ వారే అధికం. ఈ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి భారాస, కాంగ్రెస్ అభ్యర్థు లు తలసాని శ్రీనివాస్ యాదవ్, కోట నీలిమ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో అధికంగా తమిళనాడుకు చెందిన వారు స్థిరపడ్డారు. వారి మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రంగంలోకి దిగారు. ఇక్కడి తమిళులతో మంత్రి సమావేశమై బీజేపీ అభ్యర్థి దీపక్రెడ్డికే ఓటు వేయాలని అభ్యర్థించారు. శేరిలింగంపల్లి, కూకట్పల్లిలో ఆయా సంఘాల తో మంత్రి కేటీఆర్ మాట్లాడి తమకు మద్దతివ్వాలని కోరారు. ల్బీనగర్ పరిధిలో తెలంగాణలోని వివి ధ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్య ర్థులు సుధీర్రెడ్డి, మధుయాస్కీ ఆయా ఓటర్ల మీదే దృష్టిసారించారు. మహేశ్వరంలో దాదాపు 70 వేల నుంచి లక్ష మంది వరకు బిహార్, రాజస్థాన్, యూపీ, ఇతర ప్రాంతాల ఓటర్లు ఉన్నారు. వీరు ఎ టువైపు మొగ్గుచూపితే వారికే విజయం లభించే అవకాశం ఉంది. దీంతో అభ్యర్థులు సబితా ఇంద్రా రెడ్డి, కేఎల్ఆర్, అందె శ్రీరాములు వీరితో మాట్లాడుతున్నారు. ఆయా పార్టీలకు చెందిన ఇతర రాష్ట్రాల నేతలను రప్పించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. యూపీ సీఎం యోగిఆదిత్యనాథ్తో భాజపా ప్రచారం చేపట్టనుంది.

# కోవిడ్ వ్యాక్సిన్తో ఆకస్మిక మరణాల ముప్పు పెరగదు

**న్యూఢిల్లీ, నవంబర్ 22(మరో ఉదయం):**

కొవిడ్-19 వ్యాక్సిన్ యువతలో ఆకస్మిక మరణాల ముప్పును పెంచదని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అధ్యయనం వెల్లడించింది. కనీసం ఒక డోసు వ్యాక్సిన్ తీసుకున్నా.. ఆకస్మిక మరణం ముప్పు తగ్గుతుందని తేల్చింది. దీనికి సంబంధిం చిన నివేదిక ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్లో ప్రచురితమైంది. యువతలో ఆకస్మిక మర ణాలకు గల కారణాలను విశ్లేషించేందుకు అక్టోబరు 1, 2021 నుంచి మార్చి 31, 2023 మధ్య కాలం లో ఐసీఎంఆర్ ఒక అధ్యయనాన్ని చేపట్టింది. దీని కోసం ఆకస్మికంగా మరణించిన 18-45 ఏళ్ల వయసు వ్యక్తుల కేసులను అధ్యయనం చేసింది. ఇందులో భాగంగా 729 కేసులు, 2,916 కంట్రోల్ కేసులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించింది. ఈ అధ్యయనంలో రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ఆకస్మిక మరణాల ముప్పు తక్కువగా ఉందని తెలిపింది. కనీసం ఒక డోసు వ్యా క్సిన్ తీసుకున్నా.. ఈ ముప్పు తగ్గుతుందని నివేదికలో పేర్కొంది. ఈ ఆకస్మిక మరణాలకు ధూమ పానం, తీవ్ర శ్రమ, మరణించడానికి 48 గంటల ముందు మద్యం సేవించడం, మత్తు పదార్థాల విని యోగం వంటి వాటితోపాటు, కొవిడ్ చికిత్స తర్వాత జీవనశైలిలో మార్పులు, ఆహారపు అల వాట్లు వంటివి కూడా కారణాల కావచ్చని తెలిపింది.



# విశాఖలో స్కూల్ ఆటోను ఢీకొన్న లారీ

## 8మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు

## ఆస్పత్రికి తరలించి చికిత్స

**విశాఖపట్టణం,నవంబర్21(మరో ఉదయం):**

విశాఖలో బుధవారం ఉదయాన్నే ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.జిల్లాలోని సంఘం శరత్ థియేటర్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది విద్యార్థులు గాయపడ్డారు. స్కూల్ ఆటోను లారీ ఢీకొట్టడటంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఎనిమిది మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. గాయపడిన విద్యార్థులు బేతని స్కూలుకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. లారీ డ్రైవర్, క్లీనర్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటోను లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 8 మంది పిల్లలు గాయపడ్డారు. గాయపడ్డ విద్యార్థులను స్థానికంగా ఉండే సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్, క్లీనర్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం దృశ్యాలు చాలా హృదయవిదారకంగా ఉన్నాయి. చిన్నారుల రక్తమోడుతూ రోడ్డుపై పడి ఉండటాన్ని చూసిన వారి కళ్లు చెమర్చాయి. బేతని స్కూల్ విద్యార్థులు ఈ ఉదయం ఆటోలో స్కూల్ వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. సంఘం శరత్ థియేటర్ సమీపంలో స్కూల్ పిల్లలు ప్రయాణిస్తున్న ఆటోను వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. అంతే అటో పల్టీలు కొట్టింది. ఈ దెబ్బకు అటోలో ఉన్న విద్యార్థులు రోడ్డుపై పడిపోయారు. ఆటో నుజ్జు నుజ్జు అయిపోయింది. ఆ ప్రమాదాన్ని చూసిన వారంతా ఘోరం జరిగిపోయిందని అనుకున్నారు. మెరుపు వేగంతో స్పందించిన స్థానికులు ఆటోను లేపి పిల్లలకు సపర్యలు చేశారు. పిల్లలు బోరున ఏడుస్తూ రక్తం కారుతున్న గాయాలతో రోడ్డుపై పడి ఉండటం చూసిన వారి హృదాయాలు చలించిపోయాయి. అటు నుంచి వెళ్తున్న ప్రతి ఒక్కరు ఎవరికి తోచిన విధంగా వారు పిల్లలకు సాయం చేశారు. స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఆటోను ఢీ కొట్టిన తర్వాత లారీ డ్రైవర్, క్లీనర్ పారిపోయేందుకు యత్నించారు. వారి స్థానికులు, ఆటో డ్రైవర్లు పట్టుకొని బంధించారు. పోలీసులు వచ్చే వరకు అక్కడే ఉంచి వారికి అప్పగించారు. ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పరుగుపరుగున కొందరు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మరికొందరు ఆసుపత్రికి చేరుకున్నారు. రక్తపు గాయాలతో పడి ఉన్న తమ చిన్నారులను చూసుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. మధురవాడ, నగరం పాలెం రోడ్డులో కూడా ఓ స్కూల్ ఆటో బోల్తా పడింది. ప్రమాదం జరిగిన టైంలో ఆటోలో ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. పంది అడ్డం రావడంతో దాన్ని తప్పించే క్రమంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఒకే కుటుంబంలో 150 మందికి ఆరు వేళ్లు

**పానీపట్, నవంబర్ 22(మరో ఉదయం):**

హర్యానా రాష్ట్రంలోని పానీపట్ జిల్లా బాబర్పుర్కు చెందిన జా నీ కుటుంబంలోని 150 మంది కాళ్లు లేదా చేతులకు ఆరేసి వేళ్లు కలిగి ప్రత్యేకత సంతరించుకున్నా రు. ఇలా కాళ్లు లేదా చేతులకు ఆరేసి వేళ్లు ఉండడం వల్ల తమకు ఎలాంటి సమస్య అనిపించదని జానీ పేర్కొన్నాడు. అయితే చెప్పులు, షూస్ వేసుకునే సమయంలో కాస్త ఇబ్బందిగా అనిపిస్తుం దని అన్నాడు. తన కుటుంబంలో కొంత మంది బాబర్పుర్లో.. మరికొందరు పానీపత్ పక్కనే ఉన్న నోహ్రా గ్రామంలో నివసిస్తున్నారని వివరించాడు. ఒకే కుటుంబంలో చాలా మంది ఆరు వేళ్లతో పుట్టడాన్ని వైద్య పరిభాషలో పాలీడాక్టిలీ అంటారని వైద్యాధికారి డాక్టర్ జైన్శ్రీ తెలిపారు.



# హాలీవుడ్ సినీ ఫక్కీలో నౌకపై హెలికాప్టర్ దాడి

**టోక్యో, నవంబర్ 22(మరో ఉదయం):**

ఎర్ర సముద్రంలో సరకు రవాణా నౌక గెలాక్సీ లీడర్ను హెలికా ప్టర్తో వెంబడించి హౌతీ రెబల్స్ స్వాధీనం చేసుకున్న వీడియో దృశ్యాలు హాలీవుడ్ సినిమాల్లోని యాక్షన్ సీన్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి. దీనికి సంబంధించిన వీడియోను తిరుగుబా టుదారులు విడుదల చేశారు. గాజాపై యుద్ధాన్ని ఆపేంత వరకు ఇజ్రాయెల్పై సముద్ర దాడులు చేస్తామంటూ మరోసారి హెచ్చరించారు. నౌకను విడిపించేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు జపాన్ వెల్లడించింది. తిరుగుబాటుదారులు హెలికాప్టర్లో ఎర్ర సముద్రంపై ఉన్న నౌక దగ్గరకు చేరుకున్నారు. షిప్పై ఎవరూ లేని సమయంలో డెక్పై హెలికాప్టర్ ల్యాండ్ అయింది. అందులోం చి దిగిన హౌతీ రెబల్స్ నినాదాలు చేస్తూ, కాల్పులు జరుపుతూ పరుగెత్తి.. వీల్హౌస్, కంట్రోల్ సెంటర్ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తర్వాత నౌకను యెమెన్లోని సలీఫ్ పోర్టుకు మళ్లిం చారు. ఓడపై దాడి కేవలం ఆరంభం మాత్రమేననీ.. గాజాపై యుద్ధాన్ని ఆపేంత వరకు ఇజ్రాయెల్ పై సముద్ర దాడులు చేస్తామని హౌతీ అధికార ప్రతినిధి తెలిపారు. నౌక తుర్కియే నుంచి భారత్కు వస్తున్న సమయంలో హైజాక్ జరిగింది. అందులోని 25 మంది సిబ్బందిని హౌతీ రెబల్స్ బందీలు గా తీసుకున్నారు. హౌతీలు గెలాక్సీ లీడర్ నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఐక్యరాజ్య సమితి సెక్రె టరీ జనరల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఖండించారు. ఇది ఇలావుంటే, ఆ నౌక తమది కాదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

# ఆశించిన స్థాయిలో లేని మంగళవారం

చిత్ర దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహించిన సినిమా 'మంగళవారం' ఆశించిన స్థాయిలో లేదన్న విమర్శలు, పెదవి విరుపులు వస్తున్నాయి. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా నటించారు. నందిత శ్వేత, దివ్య పిళ్లై, రవీంద్ర విజయ్, అజయ్ ఘోష్, శ్రీ తేజ్, శ్రవణ్ రెడ్డి ఇతర ప్రధాన తారాగణం. ఏ క్రియేటివ్ వర్క్స్, ముద్ర మీడియా వర్క్స్ బ్యానర్లపై స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ నిర్మించారు. నవంబర్ 17న ప్రపంచవ్యాప్తంగా తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలైన ఈ చిత్రం మంచి స్పందనను రాబట్టుకుని.. విజయవంతంగా థియేటర్లలో ప్రదర్శింపబడుతోంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ సక్సెస్ టూర్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడ ప్రముఖ హోటల్లో చిత్ర బృందం సందడి చేసింది. ఈ కార్యక్రమంలో హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ.. 'మంగళవారం చిత్రంలో నటించడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాలో ఎంతో ఛాలెంజింగ్‌గా నేను నటించాను. డైరెక్టర్ ఈ కథ గురించి చెప్పినప్పుడు శైలజ పాత్రలో నటించడానికి ఆలోచించాను. నిజంగా ఇలాంటి పాత్ర చేయడానికి చాలా గట్స్ కావాలి. కథ విన్న తర్వాత ఈ పాత్ర చేయడానికి మొదట మా అమ్మ అనుమతి కోరా. ఆమె వెంటనే అనుమతి ఇచ్చారు. అమ్మ ఓకే అనగానే చాలా సంతోషంగా అనిపించింది. గ్రామీణ వాతావరణంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇది. మహిళా ప్రేక్షకుల నుండి విశేష స్పందన రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ చిత్రాన్ని బోల్డ్ మూవీ అనుకుంటున్నారు. ఈ సినిమా చూస్తేగాని.. సినిమా యొక్క విలువ తెలుస్తుంది. ఈ చిత్రంలో అసభ్యకర సన్నివేశాలు ఏమీ లేవు. కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రం. త్వరలో 'మంగళవారం 2' సెట్స్ మీదకి రానుందని తెలిపారు.

ఆర్ఎక్స్ 100 తర్వాత అంతటి ఘనవిజయం ఈ చిత్రానికి లభించింది. ఇందులో ప్రతి సన్నివేశం ఒక ట్విస్ట్‌గానే ఉంటుంది. చివరి 40 నిమిషాలు ఉత్కంఠ కలిగించేలా చేస్తాయి. ప్రతి ఒక్కరికీ ఒళ్లు గగుర్పొడిచేలా సన్నివేశాలు ఉన్నాయి. పాయల్ రాజ్‌పుత్ ఈ చిత్రానికి మెయిన్ పిల్లర్‌లా నిలిచారు. ఈ సినిమాలో నటించిన ఆవిడ గట్స్‌కి హాట్సాఫ్ చెబుతున్నాను. ఈ చిత్రంలో నటించిన నటీనటులందరూ ఈ చిత్రానికి ప్రాణం పోశారు. లక్ష్మణ్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ చిత్రాన్ని ఆదరించడం చాలా సంతోషంగా ఉంది. ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు విజయోత్సవ యాత్రను చేపట్టాము. ప్రతి థియేటర్లో ప్రేక్షకులు నుండి వస్తున్న స్పందనను మరువలేము. 'మంగళవారం2' చిత్రాన్ని కూడా త్వరలోనే ప్రారంభిస్తాం' అని అన్నారు.







## అల్లు అర్జు కుమార్తెతో సరదాలు పుట్టిన రోజు సందర్భంగా ఫన్నీ అల్లరి

టాలీవుడ్ ఐకాన్ స్టార్, నేషనల్ అవార్డు విన్నర్ అల్లు అర్జున్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయనకు సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే బన్నీ సోషల్ మీడియాలో ఎంత ఫేమస్సో .. ఆయన గారాల పట్టి అల్లు అర్హకూడా అంతే ఫేమస్. ఇక నెట్టింట తండ్రీ కూతురు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. వీరిద్దరికి సంబంధించిన వీడియోలను బన్నీ భార్య అల్లు స్నేహ రెడ్డితో పాటు.. అల్లు అర్జున్ అప్పుడప్పుడు తరచూ సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంటారు. ఇక అవి చూసిన బన్నీ ఫ్యాన్స్ తెగ ఖుషీ అవుతుంటారు. ఇదిలా ఉంటే.. తాజాగా అల్లు అర్హ మంగళవారం తన 7వ పుట్టినరోజు జరుపుకుంది. ఈ సందర్భంగా తన గారాల పట్టికి బన్నీ ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు అర్హకు సంబంధించిన ఫొటోలతో పాటు ఒక జిఫ్ వీడియోను అల్లు అర్జున్ సోషల్ మీడియాలో పంచుకున్నాడు. ఈ పోస్ట్‌కు నా సంతోషాల సమూహం' అని క్యాప్షన్ ఇచ్చాడు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన నెటిజన్లు అర్హకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



## ఆ అగ్రనటుడు నన్ను రూమ్‌కు రమ్మన్నాడు

చిత్ర పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనే మాట మళ్ళీ వినిపిస్తోంది. తమిళ నటి విచిత్ర తమిళ బిగ్ బాస్ హౌస్ లో వుంది. ఆమె పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ గురించి మాట్లాడుతూ ఒక తెలుగు అగ్ర నటుడు అతని రూమ్ కి రమ్మని చెప్పాడని, ఆమె తిరస్కరించండంతో ఆ సినిమా షూటింగ్ లో ఎటువంటి ప్రాబ్లెమ్స్ ఆమె ఎదుర్కొంది అనే విషయాలు ఇప్పుడు బయట పెట్టింది. ఆమె ఈ విషయాలని హౌస్ లో వున్న మిగతా సభ్యులతో పంచుకుంటూ ఈ సంఘటన 2001 లో జరిగిందని చెప్పింది. విచిత్ర 2001 లో ఒక సినిమా షూటింగ్ లో పాల్గొంది అని చెప్పింది. ఈ షూటింగ్ కేరళ దగ్గర అవుట్ డోర్ లో జరిగింది. త్రి స్టార్ హోటల్ ఇచ్చారని, షూటింగ్ అయినా తరువాత పార్టీ కి వెళితే, అప్పుడు ఆ సినిమాలో మెయిన్ హీరో కలిసాడని, అతను నేరుగా విచిత్ర దగ్గరకి వచ్చి 'రాత్రికి నా రూమ్ కి వచ్చేయి' అని చెప్పాడని విచిత్ర షాకింగ్ విషయం బయటపెట్టింది. అతను తన పేరు కూడా కనీసం అడగలేదు అని, నేరుగా ' చెప్పాడని చెప్పింది విచిత్ర. అయితే విచిత్ర అతని రూమ్ కి పోకుండా, నేరుగా తన రూమ్ కి వెళ్ళిపోయింది. ఆమె వెళ్లకపోవడంతో రోజూ ఆమెని ఆ అగ్ర నటుడు వేధించాడు అని కూడా విచిత్ర ఇంకో షాకింగ్ విషయం బయటపెట్టింది. అప్పుడే వివాహం కూడా చేసుకున్నానని, కానీ వివాహం అయ్యాక సినిమాలు మానేసాను అని అందరూ అనుకున్నారని, కానీ తనకి ఆ అగ్రనటుడు వలన జరిగిన ఆ సంఘటనతో సినిమాలు చెయ్యకూడదు అని నిర్ణయించుకున్నాను అని చెప్పింది విచిత్ర. చాలా సంవత్సరాల తరువాత విచిత్ర తమిళ బిగ్ బాస్ హౌస్ లోకి సభ్యురాలిగా వచ్చింది.



## హిట్టు కోసం నాగచైతన్య ఎదురుచూపు

అక్కినేని నాగ చైతన్య తదుపి ప్రాజెకక్టు నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చింది. కస్టడీ సినిమా అనంతరం నాగ చైతన్య,సాయిపల్లవి జంటగా కార్తికేయ2 వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత చందు మొండేటి (ఇ॰రజీనిటనీనీ పనీనిట॥బితి) దర్శకత్వంలో గీతా ఆర్ట్స్2 బ్యానర్‌లో ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రేపు నాగా చైతన్య జన్మదినం సందర్భంగా నిర్మాతలు ఈ సినిమా టైటిల్‌ను రివీల్ చేశారు. సినిమాకు తండేల్ (÷ురజీనిట॥) అని పేరు పెట్టారు. సమయాన్ని, ప్రజల కోసం ఇబ్బందులకు వ్యతిరేఖంగా పోరడడానికి ఓ నాయకుడు పుట్టాడు అంటూ ట్యాగ్ లైన్‌ను జత చేశారు. ఇప్పుడు ఈ పోస్టు సోషల్ మీడియాలో బాగా వైరల్‌గా మారింది. గతకొంతకాలంగా అక్కినేని నాగ చైతన్య ప్రస్తుతం ఒక సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ ఏడాది కస్టడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకురాగా అది ఆశించిన ఫలితాన్ని మాత్రం అందుకోలేకపోయింది. ఇక ప్రస్తుతం నాగ చైతన్య చందు మొండేటి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై దీన్ని నిర్మిస్తున్నారు. బతుకుతెరువు కోసం గుజరాత్‌లోని వీరవల్‌కు వెళ్లి సముద్రవేట చేస్తూ పాకిస్థాన్ కోస్టుగార్డులకు చిక్కిన మత్స్యకారుల ఇతివృత్తం ఆధారంగా ఔఅ23 సినిమా రానుంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకు సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. రేపు నాగ చైతన్య జన్మదినాన్ని పురస్కరించుకొని ఫస్టలుక్‌తో పాటు టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇక ఈ సినిమాకు 'తండేల్'(÷ురజీనిట॥) అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇక ఈ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో పడవలో ఉండి శత్రువులతో పోరు చేస్తూన్నట్లు యాక్షన్ మోడ్‌లో కనిపించారు నాగ చైతన్య.



# యానిమల్ చిత్ర ప్రమోషన్

## రణ్‌బీర్‌కు తెలుగు నేర్పిస్తున్న రష్మిక

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్‌కపూర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం యానిమల్ కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్ ఫేం సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నాడు. యానిమల్ డిసెంబర్ 1న హిందీతోపాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో యానిమల్ టీం ప్రమోషనల్ ఈవెంట్స్‌తో ఫుల్ బిజీగా మారిపోయింది. యానిమల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇండియన్ ఐడల్ స్పెషల్ ఎపిసోడ్ షూట్ కోసం ముంబైలో సందడి చేశారు హీరోహీరోయిన్లు. రణ్‌బీర్‌కపూర్ బ్లూ సూట్‌లో.. రష్మిక మందన్నా సంప్రదాయ చీరకట్టులో మెరిసిపోయారు. స్టూడియోలోకి వెళ్లేముందు రణ్‌బీర్‌కపూర్‌ను తెలుగులో మాట్లాడాలని అడిగాడు అక్కడే ఉన్న ఓ రిపోర్టర్. రణ్‌బీర్‌కపూర్ తెలుగులో అందరికీ నమస్కారం చెప్పాడు. ఆ తర్వాత మాట్లాడటానికి ఇబ్బంది పడితే.. పక్కనే ఉన్న రష్మిక సాయం చేసింది. నేను బాగున్నాను.. మీరు బాగున్నారా.. అంటూ రణ్‌బీర్‌కపూర్ కు చెప్పింది రష్మిక మందన్నా. మరోవైపు రణ్‌బీర్‌కపూర్‌కు కన్నడ కూడా నేర్పించింది రష్మిక. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన థర్డ్ సింగిల్ నాన్న నువ్ నా ప్రాణం లిరికల్ సాంగ్ తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో ఎమోషనల్‌గా సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే లాంఛ్ చేసిన యానిమల్ పోస్టర్లు నెట్టింట వైరల్ అవుతూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ మూవీలో బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యానిమల్ చిత్రాన్ని భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, కృషన్ కుమార్, మురద్ ఖేతని నిర్మిస్తున్నారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com